# హేమంత తుషారం – 2

ఇద్దరూ మళ్ళీ మొహాలు ఆశ్చర్యంగా చూసుకున్నారు.

''మళ్ళీ వచ్చారేం....? ఏదైనా ఇక్కడ మర్చిపోయారా...?'' హడావుడిగా మహాలక్ష్మి అడిగింది.

''ఒక విషయం అడుగుదామనుకుని మర్చిపోయానుగానీ... అది తర్వాత. నేను ఈ నాలుగిళ్ళూ దాటి వీధి చివరకు వెళ్ళేసరికి అక్కడున్న బడ్డీకొట్టు దగ్గిర వేలాడుతూ వారపత్రిక కనిపించింది. ఈ రోజే వచ్చినదన్నమాట. వెంటనే కొనేసి, అతను చిల్లర తిరిగిచ్చేలోపున అక్కడే నిలబడి సీరియల్ చదివేసా. చివర ఒక వాక్యం ఉంది తెలుసుగా. 'నెమరేసుకోవటానికి పూతరేకులాంటి తీపిజ్ఞాపకం ఒక్కటీ లేదుగా...' అని... అది చదవగానే, ఇక్కడ జరిగిన సంభాషణ జ్ఞాపకం వచ్చింది. అది సరేగానీ, ఆశ్చర్యం ఏమిటంటే... తలెత్తి ఎదురుగా చూసేసరికి 'ఆత్రేయపురం పూతరేకులు, తాపేశ్వరం కాజాలు' అని బోర్డు కనిపించింది. వెంటనే రోడ్డు దాటి అటువేపు వెళ్ళి పూతరేకులు కొన్నా...'' అంటూ మీనాక్షమ్మగారి దగ్గరకెళ్ళి ఆ పాకెట్టు అందించాడు.

''బామ్మా... మీకో, మీ మనవరాలికో... ఎవరికైతేనేం కావలసింది నేరుగా కాకుండా ఇలాంటి పద్ధతిలో తెలియజేసే అలవాటు ఉందని నాకూ తెలిసింది కాబట్టి. మీ అభిమాన పాఠకుడిగా ఈ వారం మీ సీరియల్‌లోని ఆ వాక్యం చదివాక సరదాగా ఇవి ఇద్దామనిపించింది!'' అన్నాడు.

ఆవిడ ఆనందంగా అందుకుని ''ఏదో చెప్పాలనుకుని మర్చిపోయానన్నావ్, ఏమిటదీ...?'' అనడిగింది.

''అది... ఏమిటంటే.. బామ్మా.... నేనెప్పుడైనా ఇటు వచ్చినపుడు... మీ దగ్గరకు రావచ్చునా? ఫరవాలేదా.... అని... అడుగుదామనుకున్నా....!''

మహాలక్ష్మి కలగజేసుకుంటూ ''కథల గురించి మీ అభిప్రాయాలేమైనా చెప్పాలని అనుకుంటే... ఉత్తరం రాయొచ్చుగా...?'' అంది.

''నిజమేననుకోండీ... కానీ... నా ఉద్దేశ్యం... కథలగురించి మాట్లాడాలని కాదు... కాసేపు బామ్మగారితో ఈ రోజులా గడిపితే... చిన్నతనంలో సెలవులకి మా అమ్మమ్మగారి వూరుకు వెళ్ళొచ్చినంత సంబరంగా ఉంటుందనీ... అలాంటి సంతోషం కోసమే.. అపుడపుడూ...''

పెద్దావిడ మొహం వెలిగిపోయింది. ''దానికేం భాగ్యం...! తప్పకుండా రా... నాకూ అయినవాళ్ళొచ్చి పలుకరించినట్లు ఆనందంగానే ఉంటుంది...'' అంటూ ఆవిడ పూతరేకుల ప్యాకెట్టుతో లోపలికెళ్ళిపోయింది. అందులోని వాటిని వేరే చిన్న డబ్బాలో పెట్టి... దానిలో కొన్ని కోవాబిళ్ళల్నీ, మైసూర్ పాకుల్నీ సర్ది తీసుకొచ్చి అతని చేతికిచ్చి ''మీ ఇంట్లో వాళ్ళకు మా ఇంటి పిండివంటల రుచి చూపించు...'' అని చెప్పింది. ''అవునూ.. మీ ఇంట్లో ఎవరెవరు ఉంటారూ....? నువ్వు... చేసేది ఏం ఉద్యోగం అన్నావ్...?'' అని మళ్ళీ అడిగింది.

''కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నా. ఇంట్లో... మీలాంటి బామ్మ మాత్రం లేదండీ...'' అంటూ నవ్వేశాడు.

ఆవిడా నవ్వి ''లేనివాళ్ళ సంగతి కాదు నేనడిగింది...'' అంది.

''అమ్మా, నేనూ.. అంతేనండీ...'' అన్నాడు.

''అలాగా, నువ్వు ఉద్యోగం చేసే కాలేజికి దారి ఇటే అయితే పనిగట్టుకుని రావాల్సిన అవసరం లేకుండా అప్పుడప్పుడూ కనిపిస్తూండొచ్చు...!'' అందావిడ.

''అవునండీ... దారి ఇటే... అందుకే అడిగాను...'' అనగానే మహాలక్ష్మి హేమంత్ వేపు చురుగ్గా చూసి ''కానీ... నేనివాళ ఇంట్లో ఉన్నాను కాబట్టి నాన్నమ్మ ఖాళీగా ఉందిగానీ లేకపోతే కొంచెం బిజీనే. ఊళ్ళో అయితే మా అమ్మకు సాయంచేస్తుండేది. నాకోసం ఇక్కడ ఉంటోంది. పని అంతా నాన్నమ్మదే. నన్ను సాయం చేయనివ్వదు, పనికి ఎవర్నీ పెట్టుకోదు. వంటపనే కాకుండా వడియాలు అంటుంది, ఊరగాయలంటుంది. మనం ఏం చెప్పినా వినదు! ఆపైన కథలూ కాకరకాయాలొకటి కదా...!'' అంది నవ్వుతూనే.

''నేనేమీ బామ్మగారి పనులకు అడ్డం రానులెండి. బామ్మ వంట చేసుకుంటుంటే, అవీ ఇవీ అందిస్తూ... బామ్మ దగ్గర్నుండి కొన్ని చిట్కాలు తెలుసుకుని, మా అమ్మ దగ్గర్నుండి నేర్చుకున్నవి నేనూ చెబుతూంటా. వడియాలు పెట్టినా అంతే, గిన్నె పట్టుకుని పక్కన నిలబడతా... కథల విషయానికి వస్తే... బామ్మ చెబుతుంటే మీలాగే నేనూ రాసిపెడతా! నా రైటింగూ ఫరవాలేదు లెండి... చూశారుగా, అర్థమయ్యేట్లుగానే ఉంటుంది...!''

అతని పెదవులపైకి వచ్చిన చిరునవ్వు చూడగానే ఆమెకు చిరాకొచ్చింది.

''అంత అవసరం లేదులెండి... మీరు రాసినది... మళ్ళీ నేను సరిచూసి, ఫెయిర్ చేసీ.... ఎందుకిదంతా...?''

ఆ మాటకి బామ్మ అభ్యంతరం చెప్పింది. ''ఇద్దరి ఆలోచనలకి ఇంకొకరి సలహా సూచనలూ కలిస్తే, మరింత మెరుగవుతుంది గానీ నష్టం ఏం ఉండదులేవే...!''

''చూశారా... బామ్మగారి సపోర్టు నాకే ఎక్కువ ఉన్నట్లుంది...!'' సరదాగా నవ్వాడు.

''అవునూ... బామ్మా... మీ పేరు మీనా అని ఆధునికంగా ఉంది, మరి... మీ మనవరాలికేమిటీ 'మహాలక్ష్మి' అని పాతతరం పేరు పెట్టారూ...?''

''మా నాన్నమ్మ పేరు మీనాక్షమ్మ. మీనా అని మీకెవరు చెప్పారూ....?'' చూపులో కొంచెం కోపం చూపిస్తూ అడిగింది,

హేమంత్ మీనాక్షమ్మ వేపు చూస్తూ ''బామ్మా.... మిమ్మల్ని మీ అమ్మా నాన్నలు చిన్నప్పుడు ఏమని పిలిచేవారూ...?'' అనడిగాడు.

''మీనా... బంగారుతల్లీ... అని...!'' అనగానే హేమంత్ ఫక్కున నవ్వేసి ''చూశారా... పెద్దయ్యేసరికి మీనాక్షమ్మగారు అయ్యారంతే... చిన్నప్పటి పేరు మీనాక్షి... మీనా... అంతేకదా! పెద్దయేసరికి మీ పేరు మహాలక్షమ్మ అయిపోతుంది...!'' అన్నాడు.

''మా అబ్బాయి... వాళ్ళ నాయనమ్మ పేరు పెట్టాడు కూతురికి. అది మా అత్తగారి పేరు. పెద్దలవో, ఇలవేలుపులవో పేర్లు పెద్దలకు పెట్టుకోవటం మా ఆచారం...'' మీనాక్షమ్మ జవాబు చెప్పింది.

''అవును బామ్మా.... ఆలోచనలే కాదు, పేర్లు కూడా రివర్సుగా ఉన్నాయని సరదాగా అన్నానంతే!'' అని మహాలక్ష్మి వేపు చూసి ''నిజంగానే... మహాలక్ష్మి పేరు ఎవర్‌గ్రీన్ అనుకోవచ్చు. అందమైన వాళ్ళని ఎవర్నిచూసినా మనవాళ్ళు అచ్చం మహాలక్ష్మిలా ఉంది అనటం అలవాటే కదండీ!'' అన్నాడు.

''నా పేరు గురించి నాకేం అసంతృప్తి లేదులెండి. మా నాన్న పెట్టిన పేరంటే ఇష్టమే!'' ముక్తసరిగా చెప్పింది.

''సరే... నేనిక వెళ్ళొస్తానండీ....'' అని లేచి నిలబడి ''మళ్ళీ ఇపుడే వెంటనే ఇలా రానులెండి...'' అంటూ చిరునవ్వుతో మహాలక్ష్మి వేపు చూశాడు. వెంటనే...

''మీకో సందేహం మిగిలిపోయుంటుంది. పక్కింటాయన కాబోలు మీ నాన్నమ్మగారి పేరు మీనాక్షమ్మగారని తన మాటల ద్వారా చెప్పారు. అర్థమైందిగా మీకిపుడు...'' అన్నాడు.

అతను వెళ్ళిపోగానే మహాలక్ష్మి కొంచెం చిరాకు నిండిన గొంతుతో ''నీ పద్ధతి నాకేం నచ్చలేదు. మొదటిసారే అతనేదో ఇవ్వటం... నువ్వు కాదనకుండా తీసుకుని ఇంకేదో ఇచ్చిపంపటం... ఎందుకిదంతా? అనవసర పరిచయాలు పెంచుకోవటం మంచిదేనా...?'' ఆవిడను నిలదీస్తున్నట్లుగా అడిగింది.

ఆవిడ చిరునవ్వుతో చూసి ''మొదటిసారేం కాదు... రెండోసారి వచ్చినపుడు కదా ఇచ్చానూ...?'' అంది.

మహాలక్ష్మి మిర్రి మిర్రి చూసింది. తర్వాత ఒక క్షణం ఆలోచనలో పడినట్లు మౌనంగా ఉండి నిట్టూరుస్తూ ''నేనూ కొంచెం ఎక్కువ చనువిచ్చి మాట్లాడానా అనిపిస్తోంది.... ఇపుడు ఆలోచిస్తే! అభిమానినంటూ సాకు తీసుకుని పదేపదే రాకపోకలు సాగించటం మంచిదికాదు కదా...!'' అంది.

''నిజమేగానీ... మనం అభ్యంతరం చెప్పినా, వెంటపడే రకంలా లేడు. సంస్కారవంతుడిలా అనిపించాడు. కలివిడిగా, సరదాగా ఉంటాడేమోగానీ, అతి చనువు తీసుకునే రకం కాదు. అయినా చూద్దాంలే... ఏదైనా తేడా కనిపిస్తే, అపుడే మొహమాటం లేకుండా చెప్పేస్తా...'' అంటూ తలుపు వేయటానికి ముందు గుమ్మం దగ్గరకు వెళ్ళింది, మీనాక్షమ్మ.

చివరి వాటాలో ఉండే రామానుజం కాంపౌండ్ వాల్ గేటు వేసి వస్తూ ఒక క్షణం ఆగి గుమ్మం దగ్గిరున్న మీనాక్షమ్మతో ''ఎవరండీ అతను... రెండుసార్లు వచ్చి వెళ్ళాడూ...?'' అంటూ ఆరాతీసాడు.

ఎన్నిసార్లో కూడా లెక్కపెట్టేసారా అన్నట్లు ఆశ్చర్యంగా చూసిన ఆవిడ కొంచెం ముభావంగా ''మనవడు'' అని జవాబు చెప్పింది.

ఆయన సందేహంగా చూస్తూ ''మీకు... మనవరాలు ఒక్కరే అన్నారూ..?'' అన్నాడు.

''అంటే.... దూరపు బంధుత్వం లెండి. వరసకు మనవడన్నమాట! మాతోడికోడలి... స్వంతంకాదు, ఆవిడా వరసకే, చెల్లెలి... ఆవిడా వరసకే, మరిదిగారి...''

ఆయన నిట్టూర్చి ''సరేలెండి... ఆయనా స్వంతం కాదు.. వరసకే అంటారు. అంతేగా...?'' అన్నాడు మధ్యలో కల్పించుకుని.

''అదేంకాదు... మరిది గారు స్వంతమే...'' అంటూ చిన్నగా నవ్వి ''అదంతా ఎందుకు లెండి... దూరపు బంధుత్వం అంటే సరిపోతుంది! మొన్న ఊరునుండి మా అబ్బాయి వచ్చినపుడు 'ఏమిటోనమ్మా... మాకు దూరంగా ఈ ఊళ్ళో మీరిద్దరే ఉంటున్నారూ' అని బెంగపడ్డాడు. ఈసారి వాడు వచ్చినపుడు 'మాకేం ఫర్వాలేదూ, మమ్మల్నే కాదు మా ఇంటికి వచ్చి వెళ్ళేవాళ్ళనూ రామానుజంగారు ఓ కంట కనిపెట్టి చూస్తారూ'

అని చెబుతా. కొంచెం నిశ్చింతగా ఉంటాడు... ఏమంటారూ...?'' అంది.

ఆయన ఒక నిముషం గుడ్లప్పగించి విస్తుపోయినట్లుగా చూసి వెంటనే తెప్పరిల్లి ''అవునవును... ఇరుగు పొరుగూ అన్నాక అంతేకదండీ...!'' అన్నాడు తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో.

మీనాక్షమ్మ తలుపువేసి లోపలకు వచ్చేసింది.

మహాలక్ష్మి ఆవిడ వేపు నవ్వు మొహంతో చూస్తూ ''నువ్వు మునపటిలా కాదు నాన్నమ్మా! మాటకు మాటా బాగా అప్పగించేస్తున్నావ్! పట్నం నీళ్ళు బాగా వంటపట్టినట్లున్నాయ్!'' అంది.

ఆవిడా చిరునవ్వుతో ''తుషార... అంటే... మాటలా...!'' అంది.

చిన్న పిల్లల పెద్ద మాటలకు పెద్దవాళ్ళు విస్తుబోయినట్లుగా బుగ్గన వేలేసుకుని చూస్తున్నట్లు అభినయిస్తూ ''నాన్నమ్మా...'' అంటూ పెద్దగా నవ్వింది.

ఆవిడ ఒక క్షణం మౌనంగా ఉండి, తర్వాత నిట్టూర్చి ''ఒకటా రెండా, ఆరేడేళ్ళ నుండీ నీతో ఈ పట్నంలోనే ఉంటున్నానా... మాటల్లో మార్పు రాకుండా ఉంటుందా...! ఇక నా కొకటే కోరిక. నాకు పైవాడి పిలుపు వచ్చేలోపుగానే.... నీకో తోడు ఏర్పడితే...'' అంటూ ఆగిపోయింది.

మహాలక్ష్మి ఆవిడను చేతులతో చుట్టేసింది.

''నాన్నమ్మా... నువ్వలా మాట్లాడకు. నువ్వు నిండు నూరేళ్ళూ ఆరోగ్యంగా ఉంటావ్...! నువ్వు అలాంటి ఆలోచనలు పెట్టుకోకు... నేనూరుకోను...'' అంటూ నవ్వే ప్రయత్నం చేసింది.

''బావుందే తల్లీ! మన ప్రమేయం, ఇష్టాయిష్టాలు ఏం ఉండవ్! విధి తన విధిని నిర్వర్తించుకుంటూ

ఉంటుంది...!'' అంటూ నిట్టూర్చింది.

''నాన్నమ్మా... నీ గురించే నా బాధ! మన ఊళ్ళో అందరి మధ్యా నువ్వు హాయిగా ఉండేదానివి. నా చదువు, తర్వాత ఇపుడు ఉద్యోగం అంటూ నాతో పాటే నువ్వూ ఉండాల్సివస్తోంది!''

''నాకేమే... నేను హాయిగానే ఉన్నాను! ఊరుకి దూరంగా ఏం ఉంటున్నానూ, పెళ్ళో పేరంటమో, పండుగ పబ్బమో అంటూ దేనికో దానికి నెలకోసారైనా వెళ్ళి వస్తున్నానా. ఆపైన ఊరు నుండీ ఎవరో ఒకరు వచ్చి కనిపిస్తూనే ఉన్నారు! ఇంకేం కావాలీ! నువ్వు నాకోసమనే కదూ, నీ కిష్టంలేకపోయినా ఈ వాటాలో ఉండటానికి ఒప్పుకున్నావ్...! మూడువాటాల వాళ్ళూ ఎంతో కలివిడిగా ఉంటారు! నాకు చుట్టూ ఓ పదిమంది కనిపిస్తూ ఉంటే చాలు! అవునేవ్ నీకు చెప్పటం మరిచిపోయా... నిన్ననేం జరిగిందో తెలుసునా...?'' అంటూ ఆవిడ నవ్వుతూ మనవరాలివేపు చూసింది.

తనని మరిపించటానికి సంభాషణని తేలిగ్గా సరదాగా మార్చే ప్రయత్నమని మహాలక్ష్మికి అర్థమైంది. నవ్వు మొహంతో ''ఏం జరిగిందేం...? నిన్నటి విషయం అయితే ఇప్పటివరకూ చెప్పనేలేదూ...?'' అంది.

సాధారణంగా మహాలక్ష్మి సాయంకాలం ఇంటికి రాగానే, ఆవిడ ఆరోజు అందరూ ఏమేమి కబుర్లు చెప్పుకున్నారో అవన్నీ ఏకరువు పెట్టటం అలవాటు. మహాలక్ష్మికి ఆ విషయాల పట్ల ఆసక్తి లేకపోయినా నాన్నమ్మ కబుర్లని ఇష్టంగానే వింటూంటుంది.

మహాలక్ష్మి మాటలకు ఆవిడ వెంటనే ఉత్సాహంగా మొదలుపెట్టేసింది.

''నేను చేటలో బియ్యం బాగు చేసుకుంటూ మనింటిముందు కూర్చున్నానా... అపుడే పక్కింటి రాంబాబు ఎక్కడికో బయలుదేరాడు. వాళ్ళావిడ కామేశ్వరి వెనకే వచ్చి 'ఈ పూట కూరలేం చేయనూ?' అనడిగితే, రాంబాబు నావేపు చూస్తూ 'చూడండి మామ్మా... ఈవిడగారు ఏ పనీ స్వతంత్రంగా ఆలోచించి చేయలేదు. కూరలు ఏం వండాలో కూడా నేనే చెప్పాలి... తనకు కావాల్సిన చీరనార అయినా నేనే కొనిపెట్టాలి!' అని నిష్టూరంగా అన్నాడు.

ఆ సాయంకాలమే బట్టల మూటతో రామన్న వచ్చాడులే... కామేశ్వరి ఎప్పుడూ ఆ చీర బావుంది, ఇది బావుంది అంటూ అందరికీ సలహాలిస్తుంది గానీ తనేం తీసుకోదు. 'అమ్మో మా ఆయన్ని అడగకుండా నేనే పనీ చేయనండీ' అనేస్తుంది. కానీ నిన్నేమో ఏకంగా రెండు చీరలు తీసుకుంది. బట్టల మూట సర్దేసుకుని రామన్న వెళ్తూండగానే రాంబాబు బయటనుండి వచ్చాడు. మేం అందరం బయటే నిలబడి ఉన్నాం. కామేశ్వరి రాంబాబుకి చీరల్ని చూపిస్తూ 'నేనే స్వతంత్రంగా రెండు చీరెలు నచ్చినవి కొనేసా. బీరువాలో మొన్న మీరు పెట్టిన డబ్బులోనుండి తీసి ఇచ్చేసా...' అని చెప్పేసరికి రాంబాబు మొహం చూడాలి! ఏడవలేక నవ్వినట్లుగా పెట్టాడు...! అలా కామేశ్వరి అతని మాటల్ని తిప్పికొట్టి, తిక్కకుదిర్చింది.''

ఆ సన్నివేశాన్ని తలుచుకుని మీనాక్షమ్మ మళ్ళీ నవ్వింది.

మహాలక్ష్మి కూడా నవ్వు మొహంతో ''నాన్నమ్మా... కామేశ్వరికి ఆ సలహా నువ్వే ఇచ్చావుకదూ...?'' అనడిగింది.

''నీకెందుకలాంటి సందేహం వచ్చిందీ...?''

''ఎందుకంటే... కామేశ్వరి అంత గడుసురకం కాదు.''

''నువ్వు బాగానే పసిగట్టావే...! ఆరెండు చీరలూ చేతబట్టుకుని ఎంత బావున్నాయో అంటోంటే, 'రాంబాబు నువ్వు స్వతంత్రంగా ఆలోచించి ఏపనీ చొరవగా చేయలేవనీ, అన్నీ తనే చేయాల్సి వస్తోందనీ దెప్పుతున్నాడుగా.... చేసి చూపించరాదా' అని ప్రోత్సహించిన మాట నిజమేలే...!''

మహాలక్ష్మి సరదాగా నవ్వింది. ''రాంబాబుకి బాగానే జవాబు చెప్పార్లే! ఇంకెప్పుడూ కామేశ్వరికేం చేతకాదని అనడు! అందుకే అంటున్నాను నాన్నమ్మా... నువ్వు బాగా గడుసుమీరిపోయావని!''

''మరి... తుషార... అంటే... సామాన్యం కాదు...!''

ఇద్దరూ మళ్ళీ సరదాగా నవ్వుకున్నారు.

ఒక నిముషం మౌనంగా ఉండి తర్వాత మీనాక్షమ్మ నిట్టూర్చింది.

''అబ్బాయ్ హేమంత్... ఇక మళ్ళీ రాడనుకుంటే... ఎందుకోగానీ, నాకు మనసుకు కష్టంగా అనిపిస్తోంది! ఇంకోసారి వచ్చినపుడు... వాళ్ళ కుటుంబాన్నీ తీసుకురమ్మని చెప్పాలనీ, పరిచయం పెంచుకోవాలనీ... ఏమిటో ఆ కాసేపటిలో చాలా చాలా ఆలోచించేసా...!''

''అవును... నీ ధోరణిని బట్టి నాకూ అర్థమైంది. చెప్పానుగా, నేను కొంచెం ఎక్కువ చనువు

చూపించాననిపించి... ఇక మళ్ళీ రాకూడదనే సూచన చేసాను. అర్థం చేసుకోగలడులే. అనవసరమైన ఆలోచనలకూ, అపోహలకూ తావు ఇవ్వకూడదు. నువ్విక అతని గురించి పూర్తిగా మర్చిపో...!'' హెచ్చరికలా చెప్పింది.

ఆవిడా నిట్టూర్చి మౌనంగా ఉండిపోయింది.

★ ★ ★

''బాబూ.... ఒకసారి ఇటు రండి...'' రామానుజం పిలుపుకు గేటుతీసి లోపలకు వచ్చిన హేమంత్ ఆశ్చర్యంగా చూసాడు.

ఆయన చిరునవ్వుతో మళ్ళీ ఆహ్వానించి ''మీనాక్షమ్మగారు ఇపుడే పక్కింటి కామేశ్వరితో కలిసి కూరగాయలకోసమనుకుంటా మార్కెట్‌కి వెళ్ళారు. కాసేపట్లో వచ్చేస్తారు. అప్పటివరకూ ఇక్కడ మా ఇంట్లో కూర్చోండి....'' అంటూ హడావుడి చేసాడు. హేమంత్ కొంచెం మొహమాటంగా, ఇబ్బందిగా చూస్తోంటే ''మీరు మీనాక్షమ్మగారి మనవడే కదా... అంటే మాకూ కావలిసినవాళ్ళే... రండి... రండి...'' అనేసరికి కాదనలేక అటువేపు అడుగులు వేసాడు.

''వరండాలో ఎందుకు లెండి... లోపల ఫ్యానుగాలికి చల్లగా ఉంటుంది....'' అంటూ లోపలకు తీసుకువెళ్ళి కుర్చీ చూపించాడాయన.

''కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం....'' అంటూ ఆయన లోపలకు వెళ్తుంటే, ''అబ్బే వద్దండీ. నేను ఉదయం పూట ఒక్కసారి మాత్రమే తాగుతాను. రెండోసారి అస్సలు అలవాటు లేదు...'' అన్నాడు హేమంత్.

అదేమీ పట్టించుకోకుండా ఆయన లోపలకు వెళ్ళిపోయాడు.

''ఇదుగో... అమ్మాయిచేత కాఫీ పంపించు. చిక్కటి పాలతో బాగా పెట్టండి...''

ఆ తరువాత ఆయన మెల్లగా ఏం చెప్పారో వినిపించలేదుగానీ జవాబుగా ఆవిడ చెప్పిన మాటలు మాత్రం హేమంత్‌కి వినిపించాయి.

''ఇంత హడావుడిగా... ఇపుడేమిటీ... ముందుగా అనుకుంటే... ఓ మూర పూలమాల అయినా తెప్పించేదాన్నిగా?''

''చెప్పినట్లు చెయ్యి... వెధవ ఎదురు ప్రశ్నలు వేయకు. ఏదో ఒక్కటి పెరట్లోది మందార పువ్వు అయినా సరిపోతుందిలే.. సిల్కుచీర ఏదయినా కట్టబెట్టి, బీరువాలోది వడ్డాణం పెట్టు చాలు...'' కొన్ని మాటలు గుసగుసలుగా ఉన్నా, కొన్ని బాగానే వినిపిస్తున్నాయి.

''..... ..... ....''

''ఎవరైనా చూస్తే నవ్విపోతారు...''

''నాకు తెలుసు... నీ సలహాలేం అక్కర్లేదు. చెప్పినట్లు చేయి....''

మద్యమధ్యలో కొన్ని మాటలు వినిపించలేదుగానీ, చక్కగా భార్యాభర్తల ఈ సంభాషణ అంతా హేమంత్‌కి వినిపించింది.

వాళ్ళుగుసగుసలుగా మాట్లాడుకుంటుంటేనే ముందు గదిలో కూర్చున్న తనకి శుభ్రంగా వినిపించింది. మామూలుగా అయితే నాలుగిళ్ళ వాళ్లకీ వాళ్ళ మాటలు వినిపిస్తాయి కాబోలనుకున్నాడు హేమంత్. ఆ సంభాషణకి అర్థం ఏమై ఉంటుందా అని ఆలోచిస్తూండగానే ఆయన వచ్చి ఎదురుగా కూర్చుని మాటలు కలిపాడు.

''బాబు.... పెద్దవాడిని... ఒకమాట అడుగుతా ఫరవాలేదుగా! మీనాక్షమ్మగారిని ఒకసారి ''మీరెవరూ....'' అనడిగా. సూటిగా చెప్పకుండా ఆవిడ తెలివిగా 'కర్షకులం' అని చెప్పి 'అదేనండీ రైతులం... మా అబ్బాయి ఊళ్ళో వ్యవసాయం చేస్తాడుగా...' అంది. నేను కూడా ఆవిడకు ఇష్టం లేనపుడు ఇంకెందుకులే అని వూరుకున్నా. దూరపు బంధుత్వం అయినా మీరు ఆవిడకు మనవడు వరస కనుక ఒక్కటే కులం అయివుంటుంది. ఆవిడ చెప్పలేదు కాబట్టి మిమ్మల్ని సందర్భం వచ్చింది కనుక అడుగుతున్నా... మీరు....'' అని నసుగుతున్నట్లు చూశాడు.

హేమంత్ చిరునవ్వుతో చూసి ''మాది ఒక కులం కాదండీ. మాకు స్వంతభూమి, వ్యవసాయం ఏం లేదు. మేం బోధకులం...'' అన్నాడు.

ఆయన విచిత్రంగా చూసి ''బోద... అది జబ్బు కదా, కులం అంటారేమిటీ...?'' అన్నాడు.

''బోద కాదండీ... బోధ... అంటే... బోధించేవాళ్ళం... పిల్లలకు పాఠాలు...''

''అంటే... మీరు... స్కూలు మాస్టారా....?''

''మాష్టార్నే! కాకపోతే.... స్కూలు దాటి, కాలేజీకి వచ్చే పిల్లలకు....''

''అది చెప్పరేం... కాలేజి లెక్చరర్ అన్నమాట! అంతేగా!'' అంటూ నవ్వి మీరు కూడా మీనాక్షమ్మగారిలాగే చమత్కారంగా చెప్పకుండా తప్పించుకున్నారు! సరేలెండి... అవన్నీ తర్వాత... పెద్దవాళ్ళం చూసుకుంటాం....'' అంటూ లోపలనుండి కాఫీ కప్పుతో వచ్చిన కూతుర్ని చూసి ''రామ్మా... అబ్బాయికి కాఫీ ఇవ్వు...'' అన్నాడు నవ్వు మొహంతో.

''నేను రెండోసారి తాగనని చెప్పాకదండీ... వద్దు...'' అని హేమంత్ చేయి అడ్డుపెట్టగానే రామానుజం నవ్వుతూ ''మీరు మామూలుగా తాగకపోవచ్చునుగానీ... మా అమ్మాయి చేతి కాఫీ రుచి చూసారంటే మాత్రం ఆ నియమానికి స్వస్తి చెప్పేయక తప్పక పోవచ్చును! నా మాట నిజమో కాదో తెలుసుకోవటానికైనా మీరు రుచి చూడాల్సిందే...!'' అన్నాడు.

''మీరన్నది నిజమే అయివుంటుందిగానీ... నాకు పడదు. కడుపులో తిప్పుతుంది. అందుకని వద్దంటున్నా...'' అదే ఖచ్చితమన్నట్లుగా హేమంత్ చెప్పేసాడు.

ఆ అమ్మాయి కాఫీ కప్పుతో లోపలకు వెళ్ళటానికి సిద్ధమై వెనక్కి తిరిగేసరికి ఆయనకు కోపం వచ్చేసింది.. గట్టిగా ఏమనలేక చూపులతోనే ఉరిమి...'' కాఫీ అక్కడ పెట్టు... నేనయినా తాగుతా... వృథా చేయటం దేనికీ...'' అని ''ఒక క్షణం నువ్వూ కూర్చో....'' ఆజ్ఞాపిస్తున్నట్లుగా చూశాడు.

ఆ అమ్మాయి తండ్రి పక్కనున్న కుర్చీలో బిక్కు బిక్కుమంటూ కూర్చుంది.

రామానుజం కాఫీని జుర్రుకుంటూ తాగుతూ ''మా అమ్మాయని చెప్పటం కాదుగానీ... కాఫీ పెట్టటమే

కాదు, వంట కూడా బ్రహ్మాండంగా చేస్తుంది. మగవాడి మనసు గెలుచుకునే దారి రుచిగా వండిపెట్టటమేనని పెద్దలు సెలవిచ్చారుగా, అలా... మా అమ్మాయిని కట్టుకునే వాడు అదృష్టవంతుడే అవుతాడు! పిండివంటలు చేసినా, వడియాలు పెట్టినా... ఏదైనా అద్భుతమైన రుచి! అలాంటి పాకకళ అందరికీ అలవడదు! మా అమ్మాయి చేతిలో ఉంది మరి!

ఆడవాళ్ళకి కొద్దిపాటి చదువు చాలని నా ఉద్దేశ్యం. అందుకే ఎయిత్ క్లాసుతో ఆపేసి... చక్కగా వంటావార్పూ నేర్చుకోమ్మా అన్నా. బుద్ధిగా తలవూపింది. అదే పెద్ద చదువులు చదివిన వాళ్ళయితే మన మాట వింటారా.... చేయి దాటిపోరూ. ఇపుడు... మీనాక్షమ్మగారి మనవరాలిని ఉద్యోగం మానేసి... ఇంటిపట్టున ఉండి వంటా వార్పూ నేర్చుకోమని చెబితే వింటుందనుకుంటున్నారా....? అస్సలు వినదు! ఈ రోజుల్లో పిల్లలు కాలేజి గుమ్మం ఎక్కితేనే తలబిరుసు సమాధానాలు చెబుతున్నారు... ఇక

ఉద్యోగాలు వెలగబెట్టేవాళ్ళ సంగతి వేరే చెప్పుకోనక్కర్లేదు!

నేనంటున్నానని మరోలా అనుకోకండి గానీ... ఆ మీనాక్షమ్మ మనవరాలి సంగతేమిటో నాకు బోధపడదు! పిల్లకు పెళ్ళిచేయాలనే ఆలోచనే ఆ పెద్దావిడకు ఉన్నట్లు నాకు అనిపించదు! ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరిగితే బావుంటుందని సలహా ఇద్దామనుకున్నాగానీ.... అమ్మో... కొరివితో తలగొక్కునే సరదా నాకెందుకని ఊర్కున్నా! ఉద్యోగం చేస్తున్నందుకో, మరొకటో తెలియదుగానీ... ఆ పిల్లకు భలే టెక్కులెండి. మేం బయట కనిపిస్తామా... ఏదో నవ్వీ నవ్వనట్లు ఓ చూపు చూసి చటుక్కున లోపలకు వెళ్ళిపోతుందిగానీ ఒక్క మాటా ఉండదు! ఏ మాటకి ఆమాటే చెప్పుకోవాలి.... ఆ పెద్దావిడ మాత్రం అందరితో కలుపుగోలుగా కబుర్లుచెబుతుంది! అందుకేనండీ నే చెబుతున్నది.... ఆడపిల్లలకి చదువు చెప్పిస్తే... తెలివిమీరి ఎదురు తిరగటమే తప్ప ప్రయోజనం ఏం ఉండదండీ!'' అని కూతురి వేపు కొంచెం చిరాగ్గా చూసి ''నువ్వేమిటీ అలా గుండ్రాయిలా కూర్చుండిపోయావు...? ఇక లే...'' అన్నాడు విసురుగా.

ఆ అమ్మాయి బిత్తర చూపులతో చటుక్కున లేచి నిలబడిరది.

''అమ్మాయి పేరు మీకు చెప్పనే లేదుగా, కనకరత్నం! మా అమ్మ పేరే పెట్టుకున్నా. ఆపైన... ఇది పుట్టినపుడు చూసినవాళ్ళంతా బంగారు బొమ్మలా ఉందని బాగా ముద్దు చేసేవాళ్ళు! పిల్ల రంగునిబట్టి కొంతా, మా అమ్మపేరని మరికొంత ఆలోచించి ఈ పేరు నిర్ణయించా. అమ్మాయి పెట్టుకున్న వడ్డాణం చూసారా. తన పేరు పెట్టారని మా అమ్మ ఆనందంగా దీనికే ఇచ్చింది! ఎన్ని సవర్లో గుర్తులేదుగానీ... ఎక్కువే బరువుంటుంది. పట్టుకు చూస్తే ఎంత దిట్టంగా ఉందో తెలుస్తుంది...!'' అంటూ కూతురివేపు చూసి ''నువ్వెందుకే అలా గెడకర్రలా నిలబడిపోయావు... ఇక లోపలకు తగలడు.... అబ్బాయి ప్రశ్నలవీ అడిగే రకం కాదులే, బాగా మొహమాటస్తుడులా ఉన్నాడు...'' అనే సరికి ఆ అమ్మాయి చటుక్కున అడుగులు వేసి కాళ్ళకు చీరకుచ్చిళ్ళు అడ్డంపడినట్లయి తూలిపడబోతూ నిలదొక్కుకుంది. అపుడే ఓసారి హేమంత్‌ని క్రీగంట చూసి... తడబడే అడుగులతో లోపలకు వెళ్ళిపోయింది.

హేమంత్ తృళ్ళిపడినట్లయి తెల్లమొహం వేసి అయోమయంగా రామానుజం వేపు చూశాడు.

ఆయన ఉద్దేశ్యం ఏమిటి....? పెళ్ళి చూపులన్నట్లుగా అలా మాట్లాడటం ఏమిటి...? అతనలా

చూస్తుండగానే రామానుజం చటుక్కున లేచి, ఖాళీ కప్పు చేతబుచ్చుకుని ''ఒక్క క్షణం... ఇపుడే వస్తానుండు బాబూ...'' అంటూ హడావుడిగా లోపలకు దూసుకెళ్ళాడు.

మళ్ళీ భార్యాభర్తల గుసగుసలు... హేమంత్‌కి వినిపించేట్లుగానే సాగాయి.

''మీరేం మాట్లాడుతున్నారో తెలుస్తోందా...? మీ అమ్మగారు పిల్లలు ముగ్గురికీ అని చెప్పలేదా? పెద్దదానికి ఆ వడ్డాణం అని చెప్పేస్తున్నారే...? మీ మాటలు విని చిన్నవాళ్ళద్దరూ మొహాలు ముడుచుకున్నారు కూడానూ....!''

''నువ్వో పిచ్చి మొద్దువి! ఇలాంటివి పెళ్ళిమాటల్లో అలా వచ్చేస్తుంటాయి...! అయినా ఆతని పెద్దవాళ్ళు రావాలి... అపుడు మాట్లాడుకోవటం లాంటివన్నీ జరుగుతాయిలే...!''

''అతగాడేమో ఆ మీనాక్షమ్మలానే కులం పేరు చెప్పకుండా తెలివిగా దాటవేశాడు. మీరేమో ముందుకెళ్ళిపోతున్నారు! ఏదైనా తేడా వస్తే.... మీ అమ్మగారు మన పీక పట్టుకుంటారు! మీరేమో అప్పుడు నెపమంతా నా మీదకు నెట్టేస్తారు... ఎందుకొచ్చిన గొడవ ఇదంతా...?''

''నాకామాత్రం ఆలోచన లేదంటావా....? కట్నాలగొడవ ఉండదనుకుంటే... కులాల పట్టింపూ వదిలేసుకోవటమే! ఈ రోజుల్లో పిల్లలు ఎంతమంది.... ప్రేమ అంటూ వర్ణ సంకరం చేసెయ్యటం లేదూ....?''

హేమంత్‌కి ఒకింత కోపం... మరింత ఆశ్చర్యం... వాటితో పాటూ నవ్వూ ఒక్కసారే కలిగాయ్! కాసేపు కూర్చుని వెళ్ళండని మర్యాదకు ఆహ్వానించి... కాఫీ అంటూ కూతుర్ని చూపించి.... పెళ్ళిచూపుల తతంగంలా ఆరాలేమిటీ...?!

పాపం... ఆ చిన్నపిల్ల తనెదురుగా కూర్చోటానికి ఎంతగా బిడియపడిరదో... తత్తరపాటుతో తనవేపు చూసినపుడు ఆ మొహమే తెలియచెప్పింది! కానీ ఆ తండ్రి ఈ విషయాన్ని ఎందుకు గమనించలేదో...! పైగా కసుర్లు ఒకటీ! పెళ్ళిచూపుల విషయం ముందుగా తెలియపరిచి ఆ సన్నివేశానికి ఆ అమ్మాయి మనసును అందుకు సమాయత్తం చేసివుంటే... అదో పద్ధతిగా ఉండేది! పోనీ... కొత్తవ్యక్తిని పరిచయం చేసినట్లుగా వూరుకున్నా బాగానే ఉండేది! ఏమిటో పెళ్ళిచూపుల్లోలా ఆ చిన్న అమ్మాయి వంటనైపుణ్యం గురించి ఒకటే వివరించటం...!

లోపలకు వెళ్ళి భార్యతో తనకు వినిపిస్తాయేమోననే ఆలోచన లేకుండా పెళ్ళి ప్రస్తావన! ఆయన అమాయకత్వానికి నవ్వుకోవాలా...? లౌక్యంగా, తెలివిగా వ్యవహరిస్తాననుకుంటున్నారా...? ఆయన ధోరణిని ఎలా అర్థం చేసుకోవాలీ...?

రామానుజం తిరిగి రాగానే ''నేనిక వెళ్ళొస్తానండీ... మీనాక్షమ్మగారింకా రాలేదు... అయినా పనేంలేదు... మరోసారి వస్తాలెండి...'' అంటూ హేమంత్ లేచి నిలబడ్డాడు.

ఆయన నవ్వు మొహంతో ''మరోసారి వస్తానన్నందుకు చాలా సంతోషం బాబూ. ఒక్క నిముషం కూర్చోండి...'' అంటూ చేతిలోని ప్లేటును అతని ముందున్న చిన్న బల్లపై పెట్టాడు.

★ ★ ★